నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 1 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL

వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాప్ ప్రారంభం

బాసర, జనవరి 31 : బాసరలోని ఆర్జీయూకేటీలో శుక్రవారం 'పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్' అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించినట్లు ఓఎస్‌డీ మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ, విద్యారంగానికి చెందిన నిపుణులను ఒక చోటుకు చేర్చి విద్యార్థులు, అధ్యాపకులతో వారి జ్ఞానం, నైపుణ్యాన్ని పంచుతుందని తెలిపారు. పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల్లో వాటి అప్లికేషన్‌లపై సమగ్ర అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని కోఆర్డినేటర్ లక్ష్మణ్, ముత్యం తెలిపారు. ఏవో రణధీర్ సాగి, అధ్యాపకులు, తదితరులున్నారు.

అమ్మవారి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

బాసరలో నేటి నుంచి వసంతోత్సవాలు

ఏర్పాట్లు పరిశీలించిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర, జనవరి 31 : దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన బాసర జ్ఞాన సరస్వతీ పుణ్యక్షేత్రంలో నేటి నుంచి వసంత పంచమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బాసరలో సరస్వతీ అమ్మవారి ఆలయం నిర్మించిన నాటి నుంచి ప్రతి యేటా మాఘ శుద్ధ పంచమి రోజున అమ్మవారి జన్మదినాన్ని నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 1న శనివారం నుంచి మూడు రోజుల పాటు వసంత పంచమి(శ్రీ పంచమి) వేడుకలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వసంత పంచమి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు వివిధ జిల్లాలతో పాటు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోండి

సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం నుంచి నిర్వహించే వసంత పంచమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించి ఉత్సవాలపై ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం గోదావరి పుష్కర ఘాట్ వద్ద పరిశుభ్రత, దుస్తులు మార్చుకునే గదులు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, వైద్య సేవలు, కంట్రోల్ రూమ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం వీఐపీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, బాసర ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ వద్ద అపరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం

వసంత పంచమి ఉత్సవాల నేపథ్యంలో ఘాట్‌ల వద్ద చెత్తా చెదారం తొలగించక పోవడంపై అధికారులపై ముథోల్ ఎమ్మెల్యే రామారావుపాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే బైఠాయించి వెంటనే ఘాట్లను శుభ్రం చేయాలని లేదంటే తమ పార్టీ కార్యకర్తలతో శుభ్రం చేయిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

కొందరికే భరోసా?

- నిర్మల్ జిల్లాలో 18 గ్రామాల్లోనే అమలు
- 1.75 లక్షల మంది రైతులు, 27,457 మంది కూలీలు సాయం అందక ఎదురుచూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల అసహనం

నిర్మల్, జనవరి 31(నమస్తే తెలంగాణ): రైతులందరికీ ఇవ్వాల్సిన రైతు భరోసా సాయం కేవలం ఎంపిక చేసిన గ్రామాల్లోనే అందజేయడంపై జిల్లాలోని మిగతా గ్రామాల రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు ఎదురుచూపులు తప్ప ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 425 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వీటిలో మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసి 18 గ్రామాల్లోని రైతులకు మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా, రైతు కూలీలకు ఆత్మీయ భరోసా సాయాన్ని అందించింది. ఈ గ్రామాల్లోని 7900 మంది రైతుల ఖాతాల్లో రూ.10.54 కోట్లు జమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా రూ.1,75,000 మందికి రూ.260 కోట్ల రైతుభరోసా పెట్టుబడి సాయం అందాల్సి ఉన్నది. మండలానికి ఒక్క గ్రామంలో ఎలా ఇస్తారని తామేం పాపం చేశామని, తమకెందుకు రైతుభరోసా వర్తింపజేయలేదని మిగతా రైతులు మండిపడుతున్నారు. ఇప్పుడు ఇస్తాం, అప్పుడు ఇస్తాం... అంటూ పాలకులు పూటకో మాట చెబుతుండడంతో విసుగు చెందుతున్నారు. ఇప్పటికే గత వానకాలం పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు యాసంగి సీజన్‌లోనూ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ పేరుతో పథకాలను పెండింగ్‌లో పెడతారేమోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. మొదట జనవరి 26న రైతుభరోసా సాయాన్ని అందిస్తామని ప్రకటించడంతో రైతులందరూ ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఆ రోజు బ్యాంకులకు సెలవు కావడంతో 27వ తేదీ ఉదయం నుంచి జమవుతాయని అంతా భావించారు. కాని జనవరి 27న.. ఎంపిక చేసిన గ్రామాల రైతులకే భరోసా సాయం అందిస్తామని, మిగతా వారికి మార్చి 31 వరకు జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుంట భూమి మొదలుకొని అర్హులైన ప్రతి రైతుకూ రైతు బంధు సాయాన్ని రైతులందరికీ ఏకకాలంలో జమయ్యేవి. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి అనేక కొర్రీలతో రైతుభరోసా అమలు చేస్తుండడంతో, మళ్లీ కేసీఆర్ పాలననే రైతులు గుర్తు చేసుకుంటున్నారు. రైతుల పాలిట కేసీఆర్ దేవుడి లాంటి వారని కొనియాడుతున్నారు.

అధికారుల వద్దకు పరుగులు...

పైలట్ గ్రామాలు మినహా మిగతా రైతులకు రైతుభరోసా జమ కాకపోవడంతో ఆయా రైతులందరూ అధికారులు, రైతు వేదికల వద్దకు పరుగులు పెడుతున్నారు. 'మాకెందుకు రైతు భరోసా జమ కాలేదు ..? వాళ్లు మాత్రమే రైతులా..? మేము కాదా..?' అంటూ అన్నదాతలు నిలదీస్తుండడంతో సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు బాసర మండలం లాబ్ది గ్రామంలో 369మందికి, భైంసా మండలం ఖత్‌గాంలో 240, దస్తూరాబాద్ మండలం దేవునిగూడెంలో 230, కడెం మండలం నర్సాపూర్‌లో 841, ఖానాపూర్ మండలం అడవి సారంగాపూర్‌లో 127, కుభీర్ మండలం అంతర్ని గ్రామంలో 305, కుంటాల మండలం విఠాపూర్‌లో 314, లక్ష్మణచాంద మండలం వడ్యాల్ తండాలో 1185, లోకేశ్వరం మండలం భాగాపూర్‌లో 573, మామడ మండలం వాస్తాపూర్‌లో 108, ముథోల్ మండలం వెంకటాపూర్‌లో 201, నర్సాపూర్(జీ) మండలంలోని నందన్ గ్రామంలో 332, నిర్మల్ రూరల్ మండలం తాంశలో 632, పెంబి మండలం పస్పులలో 327, సారంగాపూర్ మండలం పెండల్‌ధరిలో 97, సోన్ మండలం సంగంపేట్‌లో 351, తానూర్ మండలం సింగన్‌గావ్‌లో 220 మంది రైతులకు రైతుభరోసా సాయం అందింది.

688 మందికే ఆత్మీయ భరోసా...

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని నిరుపేద కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత యాసంగి సీజన్‌కు గాను వీరికి రూ.6వేల చొప్పున జమ చేయాల్సి ఉన్నది. జిల్లా వ్యాప్తంగా మొత్తం లక్ష మంది వరకు ఉపాధి కూలీలు ఉండగా, ఇందులో 27,457మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా ఎంపిక చేశారు. ఇప్పటి వరకు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి 18గ్రామాలకు చెందిన 688 మంది కూలీలకు మాత్రమే డబ్బులు జమ చేసినట్లు చెబుతున్నారు. ఇంకా జిల్లా వ్యాప్తంగా 26,769 మంది నిరుపేద కూలీలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఏం పాపం చేసినం..ఎందుకివ్వలే?

కుభీర్, జనవరి 31 : రైతు భరోసా ఎకరాకు రూ.6 వేలు కేవలం మండలంలోని ఒక్క గ్రామంలోని రైతులకే ఇచ్చింద్రు. మేము ఏం పాపం చేసినం. మాకు ఎందుకు ఇయ్యలే. ఇస్తాం ఇస్తాం అనుకుంట ఏడాది గడిచింది. షబ్బీస్ జనవరి నాడు ఏస్తమన్నారు. లాస్ట్‌కు అంతర్ని గ్రామ రైతులకు మాత్రమే డబ్బులు వేసింద్రు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎకరాకు రూ.5వేలు యాడాదికి రూ.10వేలు టంచన్‌గా పడేటివి. మీకేమైంది. బొంకియ్యకుండ్రి ఏస్తే ఏస్తమనుండ్రి లేకుంటే మాతోని ఇచ్చుడు కాదని చెప్పేయుండ్రి. కానీ చిన్న సన్నకారు రైతులు పెట్టుబడికి అవసరమవుతాయని ఎదురు జూస్తున్నరు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ చెప్పింది చేయదని గ్రామంలో చాలా మంది అన్నరు. అయినా మేము ఓట్లేసి తప్పచేసినట్లయింది.

- జాదవ్ సందీప్ పటేల్, పార్డి(కె), కుభీర్

సర్కారోళ్లు మాట మార్చిండ్రు..

ఖానాపూర్, జనవరి 31: మా ఊరి శివారులో 4.09 ఎకరాల సాగు భూమి ఉన్నది. ఇంత వరకు నాకు రైతు భరోసా రాలేదు. మా మండలంలో ఒకే ఊళ్లే రైతు భరోసా ఇచ్చింద్రు. వేరే ఉర్ల రైతులకు తర్వాత ఇస్తామని చెబుతుండ్రు. సీఎం రేవంత్‌రెడ్డి సారు జనవరి 26 నుంచి రైతు భరోసా ఇస్తామని చెప్పడంతో ఆశగా ఎదురు చూస్తున్నా. మా ఇంట్లో ఫోన్ మోగితే బ్యాంకు ఖాతాలో పైసలు పడ్డాయని అనుకుంటున్న. బ్యాంకు వద్దకు వెళ్లి ఎంక్వైరీ చేస్తున్న. కానీ ఇంత వరకు పైసలు రాలేదు. మళ్లీ మాట మార్చిన సర్కారోళ్లు మార్చి 31 అని చెప్పడంతో వస్తాయో రావో అన్న దిగులు మొదలైంది. ఇట్ల మాట మార్చడం సరికాదు. మాలాంటి చిన్న, సన్నకారు రైతులను ఆగం చేయకుండా పంట పెట్టుబడి సాయం అందిస్తే అప్పుల బాధలు తప్పుతాయి.

-బొరువొంతుల చిన్నరాజన్న, తర్లపాడు

కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది..

ఖానాపూర్, జనవరి 31: ఎన్నికలకు ముందు ఏటా రూ. 15 వేల రైతు భరోసా ఇస్తామని ప్రకటించిన రేవంత్ సర్కారు ఇప్పుడు మాట మార్చి రైతులను మోసం చేస్తున్నది. నాకున్న నాలుగెకరాల భూమిలో వరి పొలం నాట్లు పూర్తి చేశాను. జనవరి 26న రైతు భరోసా వస్తదని మస్తు సంబురపడ్డా. కాని ఒక్క గ్రామానికే ఇచ్చారని తెలిసింది. కాంగ్రెస్ మీద రైతులకు నమ్మకం పోయింది. వీళ్లకు బుద్ధి చెప్పాలని రైతులు చూస్తున్నరు. బీఆర్ఎస్ హయాంలో రంది లేకుండా కేసీఆర్ సారు 24 గంటల కరెంట్, రైతులకు సమయానికి ఎరువులు, విత్తనాలు, పంట పెట్టుబడి సాయం అందించింద్రు. రైతులు సంతోషంగా ఉండుడు కాంగ్రెస్సోళ్లకు ఇష్టం లేనట్టుంది. షరతులు లేకుండా రైతులకు పంట పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నా.

-జంగాల గంగాధర్, ఖానాపూర్

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 31: స్వయం ఉపాధితో మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీని ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందించి వ్యాపార స్థాపనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఆదిలాబాద్ బస్టాండ్‌లో విజయ డెయిరీ పార్లర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వచ్చిన వ్యాపార అవకాశాలను వినియోగించుకుంటూ మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ మధుసూదన్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్, డీఎం కల్పన. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, విజయ డెయిరీ మేనేజర్ తుషార్, కార్యాలయ అసిస్టెంట్ ఉశన్న తదితరులున్నారు.

కూలీలకు భరోసా ఎప్పుడిస్తరు..

కుభీర్, జనవరి 31 : పేద రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తమని కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్లో చెప్పి ప్రచారం చేసి అధికారంలోకి వచ్చినంక ఇప్పుడిస్తం అప్పుడిస్తమంటూ ప్రజలతో చెలగాటం ఆడుకుంటున్నారు. ఈ పథకంలో ఏదైతే 20 రోజులు ఉపాధిహామీ పథకంలో పని చేసి ఉండాలన్న నిబంధన పెట్టి ఎందరో పేద కూలీలకు పథకం వర్తించకుండా చేశారు. ఇలా చేయడం మీకు మనసెలా ఒప్పుకుంటది. మండలంలో ఒక్క గ్రామానికి మాత్రమే పథకాలిచ్చి గిరిజనులమైన మాకు ఇవ్వకుండా మోసం చేయడం సబబేనా. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయి. ఇప్పటికైనా ఆత్మీయ భరోసాతో పాటు మిగతా మూడు పథకాలు అందరికీ వెంటనే అందించాలి.

-జాదవ్ ప్రకాశ్, రైతు కూలీ, బెల్గాం తండా, కుభీర్

కేసీఆర్ సార్ పాలనే బాగుండేది..

సారంగాపూర్, జనవరి 31 : కేసీఆర్ పదేళ్ల పాలన బాగుండేది. రైతులకు ప్రతి ఏడాది రైతుబంధు కింద ఎకరానికి రెండు పంటలకు రూ.10వేలు ఇచ్చింద్రు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతులకు రైతుభరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.12 వేలు ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదు. మండలానికి ఒకే గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి రైతులకే రైతుభరోసా ఇస్తే మిగతా గ్రామాల రైతులు ఏం కావాలే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నాడు. ఇలాంటి ముఖ్యమంత్రికి రైతులు తగిన బుద్ధి చెబుతారు. రైతులు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. *- కండెల పోతన్న, సారంగాపూర్*

నాగోబా దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

నాగోబా జాతరలో పోటెత్తిన భక్తజనం

ప్రజా దర్బార్‌కు హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు

ఇంద్రవెల్లి, జనవరి 31 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం నాగోబాను దర్శించుకొనేందుకు శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని నలుమూలలతోపాటు వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి నాగోబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.దర్శనం కోసం గంటల కొద్దీ క్యూలైన్లలో బారులు తీరారు. దారిపొడవునా వెలిసిన దుకాణాలు, హోటళ్ల వద్ద వివిధ రకాల వస్తువులు, తినుబండారాల దుకాణాలు, రంగులరాట్నం వద్ద జనంతో సందడిగా మారింది.

నాగోబాను దర్శించుకున్న ప్రముఖులు

నాగోబా జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌కు హాజరైన శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి సీతక్క, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జుపటేల్, పాయల్ శంకర్, మహారాష్ట్ర అర్ని కేళాపూర్ ఎమ్మెల్యే తోడసం రాజు, కిన్వట్ మహూర్ ఎమ్మెల్యే కేరాం భీంరావ్, ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పతో పాటు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయా, డీఎఫ్‌వో బాజీరావ్‌పాటిల్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి నాగోబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో వేర్వేరుగా పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సన్మానించారు. నాగోబా ఆలయ ఫొటోలు బహూకరించారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన ఎమ్మెల్యేలు, అధికారులకు ఆదివాసీ గిరిజనులు వ్యక్తిగత రుణాలతోపాటు వివిధ రకాల సమస్యల పరిష్కారంపై అర్జీలు అందించారు. వాటిని అధికారులు శాఖల వారీగా తీసుకొని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రజాదర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై పాటలపై విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు తదితరులు పాల్గొన్నారు.

దర్బార్ వేదిక వద్ద నృత్యం చేస్తున్న కళాకారులు

నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ, పీవో

విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యం నింపాలి

నిర్మల్ డీఈవో రామారావు

నిర్మల్ అర్బన్, జనవరి 31 : విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని డీఈవో రామారావు అన్నారు. నిర్మల్ పట్టణంలోని పంచశీల్ బీఎడ్ కళాశాలలో నిర్వహించిన అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ఉపాధ్యాయులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కృషి చేయాలన్నారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి నిర్మల్‌ను మళ్లీ ప్రథమ స్థానంలో నిలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు

నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఎయిడ్స్ వ్యాధి అవగాహనపై జిల్లా స్థాయి పోటీలను డీఈవో రామారావు ప్రారంభించారు. జిల్లాలో ఎంపిక చేయబడ్డ 84 పాఠశాలల నుంచి జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, ఒక్కో విద్యార్థి చొప్పున హాజరై పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో మొదటి బహుమతి దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థి హర్షిత, ద్వితీయ బహుమతి సాగ్వి వాసవి హైస్కూల్, కన్సోలేషన్ బహుమతి సృజన్ కుమార్ పార్ పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, మోహన్ రావు, విజయ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్ తదితరులున్నారు.

ముజ్గి పాఠశాల సందర్శన

సోన్, జనవరి 31 : నిర్మల్ మండలంలోని ముజ్గి ఉన్నత పాఠశాలను డీఈవో రామారావు సందర్శించారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఇప్పటినుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో రామారావు